అభివృద్ధి, సంక్షేమంతో పాటు ప్రజారోగ్యమే లక్ష్యం


నరసాపురం రూరల్: లిఖితపూడిలో మాట్లాడుతున్న చీఫ్ విప్ ప్రసాదరాజు


పోడూరు: వద్దిపర్రులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)


యలమంచిలి: నారినమెరకలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష రిజిస్ట్రేషన్ కోసం బారులుతీరిన ప్రజలు


పాలకొల్లు అర్బన్: ఉల్లంపర్రులో ఆరోగ్య సురక్ష శిబిరానికి వస్తున్న వృద్ధురాలు

చీఫ్ విప్ ముదునూరి

నరసాపురం రూరల్: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమంతో పాటు ఆరోగ్యానికి ప్రాధాన్యతను ఇస్తూ జనం వద్దకే వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని, మెరుగైన వైద్యం అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. నరసాపురం మండలం లిఖితపూడి గ్రామంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆర్డీఓ అచ్యుత అంబరీష్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. వైద్య శిబిరంలో ప్రసాదరాజు బీపీ పరీక్షను చేయించుకున్నారు. తొలుత గ్రామంలో నిర్మించిన సచివాలయ భవనాన్ని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్వీ శివప్రసాద్ యాదవ్, తహసీల్దార్ ఫాజిల్, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ, వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్‌నాయుడు, సర్పంచ్ పోతురాజు వరలక్ష్మి, ఎంపీటీసీ చిన్నం వెంకట్రావు, దొంగ మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఉల్లంపర్రులో

పాలకొల్లు అర్బన్: పేదలంతా సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలనే లక్ష్యంతో వాడవాడలా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. పాలకొల్లు మండలం ఉల్లంపర్రులో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆయన పాల్గొని రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. సురక్ష శిబిరంలో సేవలందిస్తున్న వైద్యులు డా. సుధీర్, డా.జయదుర్గ, డా.ప్రభాకర రెడ్డి, డా.సత్యసౌజన్య, డా.నవ్యజీవన్‌లను గుడాల గోపి శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఆరోగ్య సురక్షా శిబిరంలో 10 మంది గర్భిణీలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లేశ్వరి ఆధ్వర్యంలో సీమంతాలు నిర్వహించారు. వీరికి పసుపు, కుంకుమ, గాజులు, పండ్లు, జాకెట్, చీర, పండ్లు గుడాల గోపి చేతుల మీదుగా అందజేశారు. ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు, పట్టణ సచివాలయ కన్వీనర్ ఎంఎస్ వాసు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రావాడ సతీష్, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, మాజీ సర్పంచ్ పెదపాటి హవీలా, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి డీటీసీ బాబు, మండల పరిషత్ మాజీ ప్రతిపక్షనేత చిట్టూరి ఏడుకొండలు, జోగి వెంకటేశ్వరరావు, జోగాడ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

వద్దిపర్రులో..

పోడూరు: ప్రజల ఆరోగ్యంపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) చెప్పారు. పోడూరు మండలం వద్దిపర్రులో శనివారం జగనన్న ఆరోగ్య సురక్షా శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. శిబిరంలో రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరు పెద్దిరాజు, ఎంపీపీ సబ్బితి సుమంగళి, సర్పంచ్ వడ్లపాటి రాజేంద్రప్రసాద్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వడ్లపాటి సురేష్, సచివాలయం కన్వీనర్ వడ్లపాటి సుధాకర్, వడ్లపాటి ఆనందరావు, మామిడిశెట్టి భద్రయ్య, మామిడిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం

యలమంచిలి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం అందించాలనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. మండలంలోని నారినమెరక గ్రామంలో నారినమెరక, వద్దిలంక గ్రామాలకు సంబంధించి శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో గోపి మాట్లాడుతూ ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గోపి కోరారు. శిబిరంలో డాక్టర్ చంద్రరేక, డాక్టర్ రవికుమార్, డాక్టర్ భారతీరాణి, డాక్టర్ ఉమాదేవి 511 మంది రోగులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిలువూరి కుమార దత్తాత్రేయ వర్మ, పార్టీ మండల జేసీఎస్ కన్వీనర్ ఓడూరి భాస్కరరావు, సర్పంచ్‌లు వలవల లక్ష్మి, అడబాల చిట్టిబాబు, ఉప సర్పంచ్ వద్ది శేఖర్‌బాబు, ఎంపీటీసీ ఇనుకొల్లి శ్రీధర్‌వర్మ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు ఆరుమిల్లి లక్ష్మణరావు, వద్ది వసంతం, వైఎస్సార్ సీపీ నాయకులు చల్లా విశ్వేశ్వరరావు (నల్లయ్య), వలవల సత్య ధర్మారావు, కొంబత్తుల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటుకు కృషి



మండలపరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వచీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: గ్రామాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తుందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ మైలాబత్తుల సోనీ అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మండలంలోని గ్రామాల్లో చేపట్టే వివిధ అభివృద్ధి పనులపై శాఖల వారీగా పురోగతిపై సమీక్షించారు. మండలంలోని జగనన్న కాలనీలలో పేదల కోసం నిర్మిస్తున్న గృహాల పురోగతిపై గృహ నిర్మాణ శాఖ అధికారులతో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆయా కాలనీలలో అప్రోచ్‌రోడ్లు లెవిలింగ్ పనులు పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ రవీంద్రను ఆదేశించారు. గ్రామాల్లో నిర్మించే పంచాయతీరాజ్ పనుల గురించి చర్చించారు. ఆ ఆర్థిక సంవత్సరంలో మండల పరిషత్ నిధుల నుండి రూ1.73 కోట్లు నిధులు మంజూరు కాగా రూ1.15 కోట్లతో ఖర్చు చేసి మండలంలోని పలు గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులను చేస్తున్నామన్నారు. మిగిలిన పనులు పూర్తి చేయాల్సి ఉందని పంచాయతీరాజ్ డీఈ స్వామి పేర్కొన్నారు. ప్రాధాన్యతా క్రమంలో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని డీఈ స్వామిని ప్రసాదరాజు ఆదేశించారు. గ్రామాల్లో చేపట్టే రక్షిత మంచినీటి పనుల కోసం రూ.6.44కోట్లు నిధులు మంజూరు కాగా మూడు చోట్ల రాపిడ్ ఫిల్టర్ బెడ్ పనులను చేపట్టి నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. రూ.49 లక్షల మండల పరిషత్ నిధుల నుంచి 13 పనులు చేపట్టగా 11 పనులు (పైపులైన్లు డ్రెయిన్) పూర్తయ్యాయన్నారు. రెండు పనులు పూర్తి కావాల్సి ఉన్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లోకేష్ సమావేశంలో తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్‌నాయుడు, ఎంపీడీఓ ఎస్వీ శివప్రసాద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చీఫ్‌విప్‌ను కలిసిన ఆర్డీఓ

నరసాపురం ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఎం.అచ్యుత అంబరీష్ శనివారం లిఖితపూడి పర్యటనలో ఉన్న చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజును గౌరవ పూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ముదునూరి ఆయనతో సాదరంగా మాట్లాడారు. ఆర్డీఓ అచ్యుత అంబరీష్ రెవెన్యూ డివిజన్ ఆఫీసర్‌గా నూతనంగా ఉద్యోగంలోకి వచ్చిన విషయం తెలిసిందే. గతంలో డాక్టర్ వృత్తిలో ఉన్న ఆయన ప్రజా సమస్యలపై దృష్టి సారించడంలో భాగంగా సమస్యలపై పూర్తి అనుభవం ఉన్న సీనియర్ పొలిటీషియన్ ప్రసాదరాజుతో ఈ ప్రాంత పరిస్థితులపై మాట్లాడుకున్నారు.

ఏఎస్ఎన్ఎం డిగ్రీ కళాశాలలో ఎన్ఏఎస్ఏకు ట్రైనింగ్


శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంఈఓ వీరాస్వామి

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేషనల్ అసెస్మెంట్ సర్వే ఎగ్జామ్స్‌కు సంబంధించి శనివారం శిక్షణా తరగతులు నిర్వహించారు. పాలకొల్లు మండల విద్యాశాఖాధికారి గుమ్మళ్ల వీరాస్వామి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన దేశంలోని అన్ని రాష్ట్రాల్లో 3,4,5 తరగతుల విద్యార్థినీ విద్యార్థులకు ఇంగ్లిష్ మాధ్యమంలో నవంబర్ 3న నిర్వహించే నేషనల్ అసెస్మెంట్ సర్వే ఎగ్జామ్‌కు ట్రైనింగ్ క్లాసులు నిర్వహించామన్నారు. దీనిపై నిర్వహించే సర్వేకు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్‌గా డిగ్రీ విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. విద్యార్థులు ఈ సర్వేను బాధ్యతగా నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం


న్యాయశాఖ సిబ్బందికి వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

నరసాపురం: ఆరోగ్యం విషయంలో ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ పెట్టుకోవాలని నరసాపురం మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, పదో అదనపు జిల్లా జడ్జి పి.విజయదుర్గ సూచించారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సహకారంతో శనివారం కోర్టు వద్ద వైద్య శిబిరం నిర్వహించారు. న్యాయమూర్తులతో సహా కోర్టు ఉద్యోగులు, సిబ్బంది, న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన జడ్జి విజయదుర్గ మాట్లాడుతూ కోర్టు విధుల్లో ఉండేవారు తీవ్ర ఒత్తిడిలో ఉంటారని చెప్పారు. అలాంటి వారు తరచూ సాధారణ వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనారోగ్యం బారిన పడకుండా ఉండవచ్చని చెప్పారు. శిబిరంలో రక్తపోటు, మధ/మేహం పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దాల్లా దానయ్యనాయుడు, ఆర్‌జే కుమార్, వై.ఫణికర్, ఉచిత న్యాయవాదులు సీహెచ్ వెంకటేశ్వరరావు, దొంగ నర్సింహరాజు పాల్గొన్నారు.

పాలకొల్లు నియోజకవర్గ ఓటర్లు 1.92 లక్షలు


వివిధ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఈఆర్ఓ అప్పారావు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు అసెంబ్లీ నియోజకవర్గంలో ఎస్ఎస్ఆర్ 2024 ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసినట్లు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, డీఎల్‌డీవో కె. సిహెచ్ అప్పారావు తెలిపారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి ఓటర్ల ముసాయిదా జాబితాను విడుదల చేశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్, జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి.ప్రశాంతి ఆదేశాల మేరకు ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసినట్లు తెలిపారు. ఓటర్స్ డ్రాఫ్ట్ పబ్లికేషన్‌లో భాగంగా జాబితాలో ఏమైనా క్లెయిమ్స్, అభ్యంతరాలు ఉంటే డిసెంబర్ 8 లోపు తెలియజేయాలన్నారు. అర్హులై ఉండి ఎవరికైనా జాబితాలో పేరు రాకపోయినా వారి పేరు తొలగించినా అభ్యంతరాలు తెలపవచ్చని వివరించారు. ఆయా పోలింగ్ స్టేషన్ పరిధిలో బీఎల్ఓలు డ్రాఫ్ట్ పబ్లికేషన్ విడుదల చేయాలన్నారు. నియోజకవర్గంలో 192337 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీరిలో పురుషులు 94391, మహిళలు 97936, ట్రాన్స్‌జెండర్స్ 10, సర్వీస్ ఓటర్లు 84 మంది ఉన్నారన్నారు. వివిధ రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబితా సాఫ్ట్ కాపీ మరియు హార్డ్ కాపీలను అందజేశామన్నారు. డిసెంబర్ 26 లోపు సదరు క్లెయిమ్‌లను పరిశీలించి 2024 జనవరి 5న తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తామన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం నవంబర్ 4, 5, డిసెంబర్ 2,3 తేదీలలో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తామన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల ప్రకారం టిడ్కో గృహాల సముదాయంలో కూడా పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తామని వివరించారు. వీటితో పాటు మొత్తం 190 పోలింగ్ కేంద్రాలు అవుతాయని అప్పారావు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ పెద్దిరాజు, టీపీఓ కె.వీ రత్నబ్రహ్మం, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు వంట సామగ్రి అందజేత


పాఠశాలలకు వంట సామగ్రిని అందిస్తున్న ఎంఈఓలు వీరాస్వామి, శర్మ

పాలకొల్లు సెంట్రల్: జగనన్న గోరుముద్దలో భాగంగా మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వం వంట సామగ్రిని అందిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి జి వీరాస్వామి తెలిపారు. శనివారం వివిధ పాఠశాలలకు వంట సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా వీరాస్వామి మాట్లాడుతూ వంట సామగ్రి పాఠశాలల్లో 30 కన్నా తక్కువ లేని విద్యార్థులకు నాలుగు, 31 నుంచి 50 వరకూ విద్యార్థులు ఉన్న పాఠశాలకు ఐదు, 51 నుంచి 150 మంది విద్యార్థులున్న పాఠశాలకు 6 ఉన్న కిట్లను అందిస్తున్నామన్నారు. అలాగే ఉన్నత పాఠశాలలకు 11 ఐటమ్స్ ఉన్న కిట్స్‌ను అందజేసినట్లు తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు ఈ వంట సామాగ్రిని ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 శర్మ, సీఆర్పీ రామకృష్ణ, లత, ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీప్రసాద్, కలగ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గొల్లవానితిప్పలో వేగంగా అభివృద్ధి పనులు


గొంది వెళ్లే రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం



జగనన్న కాలనీకి వెళ్లే రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: భీమవరం మండలం గొల్లవానితిప్ప గ్రామంలో అభివృద్ధి పనులు వేగంగా నిర్వహిస్తున్నారు. గొల్లవానితిప్ప – గొంది గ్రామానికి వెళ్లే రోడ్డు ధ్వంసం కావడంతో రూ.కోటి నాలుగు లక్షలతో రోడ్డును, 18 ఎకరాల్లోని జగనన్న కాలనీకి వెళ్లే రోడ్డును రూ.21.90 లక్షలతో రాళ్లు, గ్రావెల్, తారుతో అభివృద్ధి చేస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ చిల్లే వెంకటేష్, ఉప సర్పంచ్ బుద్దాల రామకృష్ణ మాట్లాడుతూ గ్రామంలో సమస్యలను ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్తే వెంటనే పరిష్కరిస్తున్నారని చెప్పారు. ఓహెచ్ఆర్ ట్యాంకు, జగనన్న కాలనీలకు విద్యుత్ లైన్, తాగునీటి వసతి కల్పిస్తున్నారని తెలిపారు. ఆయనకు గ్రామ ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయాల మూసివేత

భీమవరం (ప్రకాశంచౌక్): శనివారం రాత్రి పాక్షిక చంద్రగ్రహణం కారణంగా పలు ఆలయాలు మూసివేశారు. ప్రముఖ క్షేత్రాలయిన పంచారామ క్షేత్రం ఉమా సోమేశ్వరజనార్ధన స్వామి, మావుళ్లమ్మవారి దేవస్థానాలు, తదితర ఆలయాలను శనివారం మధ్యాహ్నం చి మూసివేశారు. ఆదివారం ఉదయం తిరిగి ఆలయాల్లో పునఃదర్శనం భక్తులకు కల్పిస్తారు.

ఖాదీ మహోత్సవ్ విజేతలు వీరే


ఖాదీ మహోత్సవ్ పోటీల్లో విజేతలు

సాక్షి, భీమవరం: స్థానిక పొట్టి శ్రీరాములు మునిసిపల్ గరల్స్ హైస్కూల్లో శనివారం ఎస్పీడీ సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఖాదీ మహోత్సవ్ పోటీలు నిర్వహించారు. భీమవరం, ఆత్తిలి, యలమంచిలి, పోడూరు, తాడేపల్లిగూడెం, కాళ్ల, పాలకోడేరు, వీరవాసరం, తణుకు, ఆకివీడు, మొగల్తూరు మండలాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. విజేతల వివరాలను ఏఎంఓ రామకోటేశ్వరరావు విలేకర్లకు తెలిపారు. వక్తృత్వ పోటీలు తెలుగు విభాగంలో బి.కీర్తిజ్ఞాన వర్షిత (జిన్నూరు), ఎస్ లిఖితదుర్గ (కోపల్లె) ప్రథమ, ద్వితీయ స్థానాల్లో, ఇంగ్లిషు విభాగంలో పి.నవ్యశ్రీ (భీమవరం), ఎస్ ఆనందిత (ఆకివీడు), దుర్గాకామేశ్వరి (పెదతాడేపల్లి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని చెప్పారు. వ్యాసరచన పోటీలు తెలుగు విభాగంలో గుబ్బల మీనాక్షి (మట్లపాలెం), బి.అపరంజి (జిన్నూరు), ప్రథమ, ద్వితీయ, ఇంగ్లిషు విభాగంలో కేవై తేజ (తణుకు), జి.లక్ష్మీనాగశైలజ (దండగర్ర), కె.మౌనికాలక్ష్మి (మత్స్యపురి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని జి.సుధారాణి, శ్రీదేవి, ఏకే మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పితానివారిపాలెంలో భారీ అన్నసమారాధన

పెనుగొండ: ములపర్రు శివారు పితాని వారి పాలెంలో శరన్నవరాత్రులు ముగింపు సందర్భంగా కనక దుర్గమ్మ ఆలయం వద్ద శనివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. దాదాపుగా 3 వేలకు పైగా భక్తులు హాజరు కావడంతో ఆలయ కమిటీ సభ్యులు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకొని అన్నప్రసాద వితరణ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వైద్య ఉద్యోగికి తీవ్ర గాయాలు

పాలకొల్లు అర్బన్: వల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బండారు వెంకటేశ్వర్లు శుక్రవారం రాత్రి పెనుమదం వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఆయన వద్దివర్రులో నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు పూర్తి చేసుకుని పాలకొల్లు వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి వెంకటేశ్వర్లుని ఢీకొట్టారు. దీంతో ఆయన కాలర్ ఎముక విరిగిపోయింది. కుడికాలు బొటన వేలు పూర్తిగా నలిగిపోయింది. గుర్తు తెలియని వ్యక్తి వెంకటేశ్వర్లుని ఢీకొట్టిన అనంతరం ఆర్ఎంపీని తీసుకుని వస్తానని చెప్పి పారిపోయారని వెంకటేశ్వర్లు బంధువు గుడాల హరిబాబు తెలిపారు. శనివారం ప్రైవేటు ఆసుపత్రిలో కాలర్ బోన్‌కి శస్త్ర చికిత్స చేశారన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయలేదని హరిబాబు తెలిపారు.

విశ్వజనని ప్రతాప్ రాజు చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు

పాలకోడేరు: అభ్యుదయ వాది పిన్నమ్మ రాజు ప్రతాప్ రాజు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత పిన్నమరాజు వృద్వీరాజు, భారతి దేవి విస్సాకోడేరులో విశ్వ జనని ప్రతాప్ రాజు చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేశారు. ఈ ట్రస్ట్ నుతః ట్రస్ట్ ను వసుధ ఫౌండేషన్ కన్వీనర్, రిటైర్డ్ డీఈఓ ఇందుకూరి ప్రసాద్ రాజు ప్రారంభించారు. ప్రతాప్ రాజు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు మెషీన్ల శిక్షణ కేంద్రాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ప్రారంభించారు. గొరగనముడి మాజీ సర్పంచ్ చెల్లబోయిన పాపారావు, శ్రీరామరాజు, గాదిరా జు రంగరాజు, సీపీఎం నేతలు జేఎన్వీగోపాలన్, గాదిరాజు సూర్యనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా ఆర్‌సీఎం చర్చి 20వ వార్షికోత్సవం


చర్చిలో ప్రార్థనలు చేస్తున్న ఫాస్టర్లు

నరసాపురం: స్థానిక చెవాకుల మురకలోని ఆర్‌సీఎం చర్చి 20వ వార్షికోత్సవ వేడుకను శనివారం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రెవరెండ్ తోట గాబ్రియేల్ మాట్లాడుతూ బైబిల్ బోధనలను విశ్వాసకులకు అర్థమయ్యేరీతిలో చేరవేయాలన్నారు. రెవరెండ్ బి.శౌరి వాక్యపరిచర్య, రెవరెండ్ టి.బిలాన్‌బాబు, సంఘ పెద్దలు ఆర్.రమేష్‌బాబు, బి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మేడపాడులో అయ్యప్ప దీక్షలు ప్రారంభం


మేడపాడులో అయ్యప్పమాల ధరించిన స్వాములు

యలమంచిలి: మేడపాడు అయ్యప్ప దీక్షా మందిరంలో గురుస్వామి గుర్రాల వెంకట్రావు ఆధ్వర్యంలో అయ్యప్పదీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది గురుస్వామి గుర్రాల వెంకట్రావుకు రెండు మండల దీక్షలు (36వ పడి) పూర్తి కానున్నాయి. 41 రోజులు పాటు జరగనున్న ఈ దీక్షలో మాల వేసుకున్న భక్తులందరికీ ఉచిత భిక్ష ఏర్పాటుచేశారు. ఇరుముడుల రోజున తాటిపాక కృష్ణస్వామి ఆధ్వర్యంలో భారీ ఎత్తున పడిపూజ నిర్వహిస్తున్నట్లు అయ్యప్పదీక్షా కమిటీ సభ్యులు తెలిపారు.

మావుళ్లమ్మ మండల దీక్ష ప్రారంభం


మావుళ్లమ్మ మండల దీక్ష స్వీకరించిన భక్తులు

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక శ్రీమావుళ్లమ్మవారి మండల దీక్షధారణ పౌర్ణమి సందర్భంగా సంప్రదాయబద్ధంగా ప్రారంభమైంది. శనివారం ఉదయం 5.15 నిమిషాలకు సుమారు 90 మంది భక్తులు అమ్మవారి మాలధరించారు. ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులను మాలధారణ చేశారు. మండల దీక్ష 41 రోజులపాటు ఉంటుందని ఆలయ ఈఓ యర్రంశెట్టి భద్రాజీ తెలిపారు. నవంబర్ 17న అర్ధ మండలి దీక్ష, 27న పాదమండల దీక్ష, డిసెంబర్ 7న దీక్ష విరమణ, మహా పూర్ణాహుతి ఉంటుందని వివరించారు. ఏటా ఆశ్వయుజ పౌర్ణమి నుంచి మాలధారణ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మానేపల్లి నాగన్నబాబు, సభ్యులు మావూరి సుందరరావు, ముత్యాలరావు, చెల్లంకి గిరి, రామాయణం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెక్ పోస్టుల అభివృద్ధికి చర్యలు

కాళ్ల/ఆకివీడు: ఆకివీడు మార్కెట్ యార్డ్ పరిధిలోని గ్రామాల రైతులకు ఏఎంసీ ద్వారా సేవలందించేందుకు కృషి చేస్తున్నామని ఆకివీడు ఏఎంసీ చైర్‌పర్సన్ షేక్ రసూల్ బీబీ హుస్సేన్ తెలిపారు. ఆకివీడు మార్కెట్ యార్డు పరిధిలో సీసలి, అజ్జమూరు గ్రామ పరిధిలో ఉన్న చెక్‌పోస్టును శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏఎంసీ పరిధిలో సీసలి గ్రామంలో ఉన్న చెక్ పోస్ట్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

సాక్షి, భీమవరం: ఉద్యోగులంతా ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని భీమవరం సీనియర్ సివిల్ జడ్జి బి.అప్పలస్వామి అన్నారు. శనివారం పట్టణంలోని న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బందికి వైద్య పరీక్షలు చేశారు. అప్పలస్వామి మాట్లాడుతూ పని ఒత్తిడి కారణంగా ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహిస్తున్న ఉద్యోగుల కోసం ఇటువంటి వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా బీపీ, షుగర్ లెవెల్స్, హిమోగ్లోబిన్ శాతం వంటివి తెలుసుకొనే అవకాశం ఉంటుందని చెప్పారు. అవసరమైనవారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వెంకటరమణరావు, పి.రమేశ్‌బాబు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాల పరిశీలన

సాక్షి, భీమవరం: విస్సాకోడేరు లేఅవుట్‌లో జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను ఆర్డీఓ కె.శ్రీనివాసులురాజు శనివారం పరిశీలించారు. నిర్మాణ సామగ్రిని నాణ్యతపై ఆరా తీశారు. పేదలకు ప్రభుత్వం నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఇళ్లు నిర్మిస్తున్న తారకరామ కన్‌స్ట్రక్షన్ అధినేత వళ్ల తారకరామ్‌కు సూచించారు.